


నేటి లోక్‌అదాలత్‌ను వినియోగించుకోవాలి

జిల్లా న్యాయమూర్తి సత్యాదేవి

ప్రజాశక్తి - భీమవరం

అన్ని కోర్టుల్లో శనివారం జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకోవాలని, దీనికి న్యాయవాదులు, పోలీస్ అధికారులు సహకరించాలని భీమవరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి పి.సత్యాదేవి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీపడదగిన అన్ని క్రిమినల్ కేసులు, మోటార్ వాహన ప్రమాద బీమాకు సంబంధించిన కేసులు, సివిల్, కుటుంబ తగాదాలు ఉభయ కక్షిదారుల ఆమోదం మేరకు రాజీ చేస్తారని పేర్కొన్నారు.

ఖరీఫ్ మాసూళ్లు ఎప్పటికీ పూర్తయ్యేనో.. దాళ్వా నారుమడులు పూర్తయ్యేదెప్పుడో.. ఇంకా పొలాల్లో ఉన్న 60 శాతం పంట గట్టెక్కేదెప్పుడో.. నాట్లు ఆలస్యమైతే దాళ్వా సాగు సాగేనా.. ఇలా రైతులను అనేక ప్రశ్నలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మిచౌంగ్ తుపాను దెబ్బకు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తడిసిన ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వకుండా వ్యవహరిస్తున్న తీరు దాళ్వాసాగుపై తీవ్ర ప్రభావం చూపనుండటంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తడిసిన ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఆచంట మండలం కొడమంచిలిలో నేలనంటి నీటిలో నానుతున్న వరిపంట (ఫైల్‌ఫొటో)

ధాన్యం కొనరు.. దాళ్వా సాగదు..!

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

దాళ్వా సాగుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న జిల్లా రైతాంగం ఆశలను మిచౌంగ్ తుపాను తుడిచేసింది. ఖరీఫ్ పంట మాసూళ్లు పూర్తిచేసి దాళ్వా నారుమడులు వేసేందుకు తీవ్ర ఆలస్యమయ్యే పరిస్థితి ఉంది. దీంతో ఇటు ఖరీఫ్ పంట పోయే.. అటు దాళ్వా పంట ఏమవుతుందో తెలియని పరిస్థితుల్లో అన్నదాత కొట్టుమిట్టాడుతున్నాడు. తడిసిన ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయలేదు. దీంతో రైతులు తడిసిన ధాన్యం ఆరబెట్టడంలోనే రోజులు గడిచిపోతున్నాయి. దీంతో రబీ నారుమడులపై దృష్టి సారించే పరిస్థితి లేకుండాపోయింది. రెండు జిల్లాలవ్యాప్తంగా ఖరీఫ్‌లో నాలుగు లక్షల ఎకరాల్లో వరిసాగు సాగింది. ఏలూరు జిల్లాలో 45 శాతం మాసూళ్లు పూర్తవ్వగా, పశ్చిమగోదావరి జిల్లాలో 35 శాతం మాసూళ్లు మాత్రమే పూర్తయ్యాయి. సరాసరిన 40 శాతం మాసూళ్లు పూర్తవ్వగా, దాదాపు 2.50 లక్షల ఎకరాల్లో పంటంతా పొలాల్లోనే ఉంది. మిచౌంగ్ తుపాను భీభత్సంతో రైతుల బతుకులు అల్లకల్లోలంగా మారాయి. తుపాను ప్రభావంతో రెండు రోజులపాటు ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షంతో పొలాల్లో మోకాళ్ల లోతుకుపైగా వరదనీరు నిలిచిపోయింది. దీంతో మాసూలు చేసిన రాశులన్నీ నీట మునిగాయి. కోత కోయాల్సిన పొలాలు నేలకొరిగి నీటిలో నాని కుళ్లిపోతున్న పరిస్థితి నెలకొంది. రబీలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 4.60 లక్షల ఎకరాల్లో సాగు చేసేందుకు జిల్లా సాగునీటి సలహామండలి సమావేశంలో నిర్ణయించారు. సకాలంలో రబీ నాట్లు పూర్తి కావాలంటే డిసెంబర్ 15వ తేదీకి రబీ నారుమడులు పూర్తి చేయాలని తెలిపారు. ఇప్పట్లో రైతులు నారుమడులు వేసే పరిస్థితి లేకుండాపోయింది. అందుకు ప్రధాన కారణం ప్రభుత్వమేనని చెప్పాలి. తడిసిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తే రైతులు వేగంగా ఖరీఫ్ మాసూళ్లు పూర్తి చేసేందుకు అవకాశం ఉంది. ప్రభుత్వం మాత్రం మాటలకే పరిమితమై రైతులను వంచిస్తోంది. పొలాల్లో నీరు తగ్గి ఖరీఫ్ మాసూళ్లు పూర్తి చేయాలంటే మరో 20 రోజులకుపైగా సమయం పట్టే పరిస్థితి ఉంది. అంటే డిసెంబర్ నెలాఖరుకు కూడా నారుమడులు పూర్తయ్యే అవకాశం కన్పించడం లేదు. నిడమర్రు, ఉంగుటూరు వంటి పలు మండలాల్లో కొల్లేరుకు ఆనుకుని ఉన్న పొలాలకు రైతులు నారుమడులు వేశారు. తుపాను దెబ్బకు పెద్దఎత్తున నీరు నిలిచిపోవడంతో నారుమడులు పనికిరాకుండా పోయే పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుత పరిస్థితి చూస్తే దాళ్వా నాట్లు ఫిబ్రవరి వరకూ పూర్తయ్యే పరిస్థితి కన్పించడం లేదు. అదే జరిగితే సాగునీటి సమస్య ఏవిధంగా ఉంటుందో చెప్పలేని పరిస్థితి. ఇది రబీ పంటపై తీవ్ర ప్రభావం చూపనుంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. దీంతో ఇటు ఖరీఫ్, అటు రబీలోనూ రైతులు నష్టాలు పాలైతే అప్పుల ఊబిలో కూరుకుపోతారు. ఖరీఫ్ మాసూళ్లు త్వరగా పూర్తికావాలంటే ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో నిబంధనలు సడలించాలి. అయితే ప్రభుత్వం అటువైపు ఏమాత్రం ఆలోచించని పరిస్థితి.

ప్రభుత్వ తీరుతో రబీ సాగుకు ఎదురుదెబ్బ
తడిసిన ధాన్యం కొనుగోలు చేయని పరిస్థితి
ఆరబెట్టేందుకు రోజులు తరబడి రైతుల అగచాట్లు
దాళ్వా నారుమడులపై తీవ్ర ప్రభావం
పలుచోట్ల వేసిన నారుమడులు జలమయం
నెలాఖరుకు నారుమడుల పూర్తి కష్టమే

తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తేనే సకాలంలో దాళ్వా సాగు


వర్షాలకు తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామంటూ ప్రభుత్వం చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఎక్కడా జరగడం లేదు. అందుకు సంబంధించి ఎటువంటి ఆదేశాలనూ ప్రభుత్వం విడుదల చేయలేదు. తేమ శాతానికి సొమ్ము కటింగ్ చేసే విధానమే కొనసాగుతోంది. దీంతో తడిసిన ధాన్యం రోడ్లపైనే దర్శనమిస్తోంది. కోతల మీద ఉన్న పొలాలు మాసూళ్లు త్వరగా పూర్తి కావాలంటే ధాన్యం కొనుగోలులో తేమశాతం నిబంధన సడలించి తడిసిన ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాల్సి ఉంది. అప్పుడు వేగంగా ఖరీఫ్ మాసూళ్లు పూర్తయ్యి దాళ్వా నారుమడులు వేసేందుకు రైతులకు అవకాశం ఉంటుంది. ఇదేవిధంగా ప్రభుత్వం వ్యవహరిస్తే దాళ్వా సాగులోనూ రైతులకు ఇబ్బందులు తప్పవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సిఎం పర్యటనా ఏర్పాట్లు వేగవంతం

విప్ గ్రంథి, కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరంలో ఈ నెల 12న ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ గ్రంథి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. సిఎం పర్యటన నేపథ్యంలో శుక్రవారం స్థానిక బైపాస్ రోడ్డులోని గ్రంధి వెంకటేశ్వరరావు ప్రభుత్వ జూనియర్ కాలేజీ వెనుక లేఅవుట్‌లో సభావేదిక, లూథరన్ హైస్కూలు గ్రౌండులో హెలీప్యాడ్‌ను వారు జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్, జెసి ఎస్.రామ్‌సుందర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. సభాస్థలి, హెలీప్యాడ్ సంబంధిత మ్యాప్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి భీమవరం బహిరంగ సభలో పాల్గొని విద్యా దీవెన నిధులను విడుదల చేయనున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి భీమవరం తొలి అధికారిక పర్యటనను అధికారులు సమిష్టి కృషితో విజయవంతం చేయాలని కోరారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. సభావేదిక, హెలీప్యాడ్ స్థలాల్లో ఉన్న వర్షపు నీటిని తోడించి, నేల చదును చేసి ఇతర పనులు శరవేగంగా చేయాలన్నారు. శాఖలవారీ కేటాయించిన పనులు అత్యంత బాధ్యతతో సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.శ్రీనివాసులురాజు, జిల్లా ఆర్అండ్‌బి శాఖాధికారి బి.లోకేశ్వరరావు, జిల్లా అగ్నిమాపక అధికారి బి శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఇఇ ఫీర్అహ్మద్‌ఖాన్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాసరావు, డిఎస్‌పి బి.శ్రీనాథ్, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, తహశీల్దార్ వై.రవికుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను వివరిస్తున్న అధికారులు

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

ఎకరాకు రూ.20 వేలు నష్టపరిహారం, ఇన్సూరెన్స్ అందించాలి
కలెక్టర్‌కు సిపిఎం నేతల వినతి

ప్రజాశక్తి - భీమవరం

మిచౌంగ్ తుపాను జిల్లాను అతలాకుతలం చేసిందని, దీని ప్రభావంతో నష్టపోయిన వరి, ఆక్వా, ఉద్యాన పంటలు, ఆకు కాయగూరలు, కొబ్బరి, అరటి, ఉప్పు, తమలపాకు రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం కోరారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సిపిఎం బృందాలు పర్యటించాయి. ఈ పర్యటనలో సిపిఎం నేతల దృష్టికి వచ్చిన సమస్యలను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి దృష్టికి ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ తీసుకెళ్లారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం వారు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రైతుల సమస్యలు పరిష్కరించి, వారిని అన్నివిధాలా ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ తుపాన్ ధాటికి అన్ని రకాల పంటలు దెబ్బతిన్నాయన్నారు. వరితోపాటు ఆక్వా, ఇతర పంటల రైతులు కూడా తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. పంట నష్టపోయిన ప్రతి ఎకరాకూ రూ.20 వేలు నష్టపరిహారం, ఇన్సూరెన్సు అందించాలన్నారు. దాళ్వా సాగుకు ఉచితంగా విత్తనాలు అందించడంతోపాటు ఎరువులు, పురుగుమందులు 50 శాతం రాయితీపై ఇవ్వాలని కోరారు. నష్టపరిహారం వాస్తవ సాగుదారులైన కౌలురైతులకే అందించాలన్నారు. తేమశాతం నిబంధనలు ఎత్తివేసి మద్దతు ధరకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు కొనుగోలు చేయాలన్నారు. మంచి సంచులు, బరకాలు సరఫరా చేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇవ్వాలని, రవాణా ఛార్జీలను పూర్తిగా ప్రభుత్వమే భరించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ బృందాలు పంట నష్టాలను వెంటనే పరిశీలించి అంచనా వేసి తగు సహాయం చేయాలన్నారు. దెబ్బతిన్న నారుమడులకు నష్టపరిహారం చెల్లించాలని, ఉచితంగా విత్తనాలు ఇవ్వాలని, దెబ్బతిన్న కాయగూరలు, ఆకుకూరలు, పండ్లతోటలు, అరటి, కొబ్బరి తమలపాకు, ఉప్పు, ఆక్వా పంటలకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. దెబ్బతిన్న రోడ్లు వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. జిల్లాఅంతా పారిశుధ్యం మెరుగుపర్చాలని కోరారు. డెల్టా ఆధునికీకరణ పనులు వచ్చే వేసవిలో యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న కాలనీల్లో పూడిక, రోడ్లు, డ్రెయిన్లు, వీధిలైట్లు, ఇతర మౌలిక వసతులు వెంటనే కల్పించాలని కోరారు. ఉపాధి కోల్పోయిన మత్స్యకారులు, వ్యవసాయ కార్మికులు, పేదలకు ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.



కలెక్టర్‌కు వినతి అందిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, నేత గోపాలన్

వీడని ముంపు..కుళ్లుతున్న పంట

ప్రజాశక్తి - ఆచంట

తుపాన్ ప్రభావంతో మూడు రోజులపాటు ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు మండలంలోని నీట మునిగిన పంట పొలాలు ఇంకా ముంపులోనే కొనసాగుతున్నాయి. తాడేరు, నక్కల, మురుగు డ్రెయిన్ల సమీపంలోని పంట పొలాల్లో ఇంకా నాలుగు అడుగుల మేర నీరు నిలిచి ఉంది. పొలాల్లో నీరు చేరి దాదాపు ఆరు రోజులు కావడంతో వరి కంకులు కుళ్లిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. ఆచంట, ఆచంట వేమవరం, పెనుమంచిలి, వల్లూరు గ్రామాల్లో మురుగు డ్రెయిన్లలో నీరు తగ్గకపోవడంతో పంట పొలాల్లో నీరు బయటకు వెళ్లే మార్గం లేకుండాపోయిందని, ఇదే పరిస్థితి మరో రెండు రోజులు కొనసాగితే ఆయా గ్రామాల్లో పంట దేనికీ పనికి రాకుండా పోతుందని రైతులు లబోదిబోమంటున్నారు. డ్రెయిన్లలో నీరు దిగువకు వెళ్లేలా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.మండలంలో ఆచంట వేమవరం, వల్లూరు, పెనుమంచిలి, కందరవల్లి, కరుగోరుమిల్లి, కోడేరు, పెదమల్లం, శేషమ్మచెరువు, భీమలాపురం, కొడమంచిలి గ్రామాల్లో వేలాది ఎకరాల్లో వరిపంట నేలనంటింది. ఆ పొలాల్లోకి పెద్దఎత్తున నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. దీంతో పంట కుళ్లిపోయే పరిస్థితి ఉందని ఆచంట వేమవరానికి చెందిన బాలం గంగాధర్, కాండ్రేగుల మసేన్, కొండేటి రామకృష్ణ వాపోయారు. కొంతమేరైనా పంట దక్కుతుందేమోననే ఆశతో ఇంజిన్ల ద్వారా నీటిని తోడుతున్నారు. నియోజకవర్గంలో నక్కల, తాడేరు, కొఠాలపర్రు డ్రెయిన్ల ఉధృతి గురువారం మరింత పెరిగింది. దీంతో పొలాల్లో నీరు లాగని పరిస్థితి ఉంది. దేవ, వల్లూరు, జగ్గరాజు పంట కాలువలు గట్టును తాకుతూ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడులు నష్టపోయామని రైతులు వాపోతున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి నష్టపోయిన కౌలురైతులకు క్రాప్ ఇన్సూరెన్స్‌తోపాటు నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.



ఆచంట వేమవరంలో పంట చేల్లో నీటిని ఆయిల్ ఇంజిన్ ద్వారా బయటికి తోడుతున్న రైతులు

తక్షణమే నష్టపరిహారం అందించాలి
శీలం హరిబాబు, ఆచంట వేమవరం

నేను ఐదెకరాల్లో 1318 వరి వంగడం సాగు చేశాను. చేలు పడిపోవడంతో పడిపోయిన వరి దుబ్బులను కట్టలు కట్టుకుని రక్షించుకునే పనిలో ఉన్నాను. కనీసం పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఉంది. తక్షణమే ప్రభుత్వం, అధికారులు స్పందించి నష్టపరిహారం అందించాలి.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

సడలించిన నిబంధనలకు అనుగుణంగా ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి శుక్రవారం ఆమె జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి సంయుక్తంగా ధాన్యం సేకరణ, రీసర్వే, ఆడుదాం ఆంధ్రా, మ్యుటేషన్స్, స్వమిత్వ, ఎన్నికలు, హౌసింగ్ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ధాన్యం తేమ శాతం ఎలాగున్నా సడలించిన నిబంధనలకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. తడిచిన ధాన్యం మొలకలు రాకుండా నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు సలహాలు సూచనలు అందజేయాలన్నారు. సుమారు 24 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రెండు, మూడు రోజుల్లో కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఆఫ్‌లైన్‌లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని పెండింగ్ లేకుండా ఆన్‌లైన్ చేయాలన్నారు. ధాన్యం సేకరణ అనంతరం డబ్బు చెల్లింపులో పారదర్శకంగా బిల్లులు జారీ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మ్యుటేషన్స్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల డాక్యుమెంట్లను పూర్తిస్థాయిలో పరిశీలించాలన్నారు. స్వమిత్వలో 9(2) నోటీసుల జారీ వేగవంతం జారీ చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, డిఆర్‌ఒ బి.శివన్నారాయణరెడ్డి, భీమవరం, నరసాపురం ఆర్‌డిఒలు బి.శ్రీనివాసులురాజు, అచ్యుత్ అంబరీష్, డిప్యూటీ ట్రైయినీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్, డిఎల్‌డిఒ కెసిహెచ్.అప్పారావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వర్లు, డిఎస్‌ఒ ఎన్.సరోజ, డిపిఒ జివికె.మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.25 వేలు నష్టపరిహారమివ్వాలి

ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు

పోడూరు: తుపాను ప్రభావంతో పంట నష్టపోయిన ప్రతి రైతుకూ తక్షణ సాయంగా ఎకరాకు రూ.25 వేలు నష్టపరిహారం ప్రభుత్వం అందించాలని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం మండలంలో జిన్నూరు, మట్టపర్రు, పెనుమదం గ్రామాల్లో ముంపునకు గురైన వరిచేలను సందర్శించారు. తడిసిన, రంగుమారిన, మొలకెత్తిన ధాన్యం అమ్మకంలో ఎదురవుతున్న ఇబ్బందులను రైతులు ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ రామానాయుడు విలేకరులతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో తేమశాతం నిబంధనలు పూర్తిగా సడలించామని ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అమలు జరగడం లేదన్నారు. రైస్‌మిల్లుల వద్ద ధాన్యంలో తేమశాతం 17కు మించి ఉంటే ప్రతిఒక్క శాతానికి కిలో చొప్పున తగ్గించి తూకం తూయడం, కిలో రూ.30 తగ్గించి ఇవ్వడం వల్ల ప్రతి బస్తాకూ రైతు రూ.వంద నుంచి రూ.150 నష్టపోతున్నారని తెలిపారు. రైతు నష్టపోతున్న సొమ్మును మిల్లర్ల మీద, రైతుల మీద భారం మోపకుండా ప్రభుత్వమే మానవత్వంతో భరించాలని రామానాయుడు కోరారు. డెల్టా ఆధునికీకరణ పనులు చేపట్టకపోవడం వల్లే ఈ విపత్తు సంభవించిందన్నారు. నష్టపోయిన రైతులను ఆదుకునేలా ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ వంటివి అందించాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి ఉద్యమిస్తానని ఎంఎల్‌ఎ హెచ్చరించారు. ఆయన వెంట టిడిపి మండలాధ్యక్షులు సూర్యనారాయణరాజు, రైతు నాయకులు రామభద్రరాజు, దొరబాబు, తులసీరావు పాల్గొన్నారు.



తడిచిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహారాజు

ప్రజాశక్తి - కాళ్ల

మిచౌంగ్ తుపాను ప్రభావంతో నష్టపోయిన వరి రైతులను ఆదుకుంటామని డిసిసిబి ఛైర్మన్, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహారాజు అన్నారు. ఏలూరు పాడులో ఇటీవల కురిసిన వర్షాల వల్ల నష్టపోయిన పంట పొలాలను ఆయన పరిశీలించారు. వరి పొలంలో నేలకొరిగిన పంటను స్వయంగా పరిశీలించారు. రైతులు ఎవరూ అధైర్యపడొద్దని, తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. కోతకు సిద్ధంగా ఉన్న వరి పొలాల్లో గింజలు మొలకెత్తే అవకాశం ఉందని, మొలకెత్తకుండా ఐదు శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేసుకోవాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు కెఎస్.శ్రీనివాస్ తెలిపారు. వరి చేలలో వర్షపు నీరు నిల్వకుండా, నీరు బయటికి వెళ్లేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి శిరీష విశ్వనాథరాజు, జెడ్‌పిటిసి సోమేశ్వరరావు, ఎంపిటిసి చిన్నాపరపు రాంబాబు, వ్యవసాయాధికారి సిహెచ్.జయవాసుకి, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రుద్రరాజు రామకృష్ణంరాజు, గుబ్బం జార్జ్ బెనహార్, రైతులు పాల్గొన్నారు.



వరిపంటను పరిశీలిస్తున్న పివిఎల్

తడిచిన ధాన్యాన్ని బేషరతుగా కొనుగోలు చేయాలి

సిపిఎం, ఎపి కౌలురైతుల సంఘం డిమాండ్

ప్రజాశక్తి - పెంటపాడు

తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే పూర్తిగా కొనుగోలు చేసి తీవ్రమైన నష్టాల పాలైన రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యంతో రైతులు ఇబ్బందులు పడుతుంటే ఆరబెట్టిన తర్వాతే తీసుకుంటామని అధికారులు చెప్పడం దారుణమన్నారు. సిపిఎం ప్రతినిధి బృందం శుక్రవారం పలు గ్రామాల్లో తడిచిన ధాన్యం రాశులను పరిశీలించింది. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ తుపాను నేపథ్యంలో ఎకరానికి రూ.మూడు వేలకుపైగా అదనంగా ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుత తడిసిన ధాన్యాన్ని బస్తాకు రూ.300 నుంచి రూ.400 వరకూ ధర తెగ్గోస్తున్నారని రాచర్లకు చెందిన రైతు మద్దుకూరి చంద్రరావు వాపోయారన్నారు. వర్షాలకు ముందే మూడెకరాలు మాసూళ్లు చేసి ఐకెపి కేంద్రాల్లో గోనె సంచుల కోసం వెళ్లినా ఇవ్వకపోవడంతో ధాన్యం అంతా వర్షాల పాలైందని రైతు పోలయ్య తెలిపాడన్నారు. ప్రభుత్వం ప్రకటనలకే పరిమితం కాకుండా నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో కరెడ్ల రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.



మొలకలొచ్చిన ధాన్యంతో రైతులు, నేతలు

ఇరగవరం: తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం పెద్ద బూటకమని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కూసంపూడి సుబ్బరాజు, మామిడిశెట్టి రామాంజనేయులు విమర్శించారు. వారు మండలంలోని ఇరగవరం, కావలిపురం, కంతేరు తదితర గ్రామాల్లో శుక్రవారం పంట పొలాలను, తడిసిన ధాన్యాన్ని పర్యటించి నేలకొరిగిన పంట పొలాలను, తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతుల నుంచి వివరాల అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుబ్బరాజు, రామాంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం జిల్లాలో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటామని చెప్పడం పచ్చి బూటకమన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో 22 శాతం వరకు తేమశాతం నిబంధనలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని, దెబ్బతిన్న పంటలతోపాటు తడిసిన, మొలకెత్తిన ధాన్యం రాశులకు కూడా ఫసల్ బీమా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. 1318 రకం ధాన్యం తడిసిన రెండురోజులకే మొలకెత్తుతుందని, దీంతో పంట నష్టం తీవ్రంగా ఉందని, ఎకరాకు రూ.30వేలు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌలురైతులు సానబోయిన శ్రీనివాసరావు, వీరవల్లి వెంకటేశ్వరరావు, పుట్టా ప్రసాద్, సానబోయిన సరస్వతి, నెర్ల దుర్గావెంకటసుబ్బారావు, సానబోయిన సత్యనారాయణ, నెర్ల కాశీ విశ్వనాథం పాల్గొన్నారు.

భూయజమానికి హక్కును కాపాడాలి

యాక్ట్ 27ను వ్యతిరేకిస్తూ విధులు బహిష్కరించిన న్యాయవాదులు

తణుకు రూరల్: భూయజమాని హక్కును కాపాడాలని న్యాయవాదులు కోరారు. తణుకు బార్ అసోసియేషన్ న్యాయవాదులు యాక్ట్ 27కు వ్యతిరేకంగా శుక్రవారం ఐదో రోజు విధులను బహిష్కరించారు. అనంతరం బార్ అసోసియేషన్, ఆలిండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కెవివివి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ సివిల్ కోర్టుకు ఉండే భూవివాదాల పరిష్కారం అధికారాలన్నీ రెవెన్యూ అధికారులకు ఇవ్వడం సరైంది కాదన్నారు. చట్టాలు చేసే ముందు న్యాయవాదుల సలహాలు సూచనలు లేకుండా చేస్తే ప్రజలకు న్యాయం అందుబాటులో ఉండదన్నారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి మాట్లాడుతూ గతంలో నమోదైన భూమి వివరాలు చెల్లుబాటు కాకుండా కొత్త రికార్డులను సృష్టించడం కేవలం కొంతమంది పెట్టుబడిదారులకు ఉపయోగపడుతుందన్నారు. భూయజమాన్య హక్కు చట్టం 27ను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఉపాధ్యక్షులు చింతపల్లి నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి హెచ్.నాగార్జునదాసు, న్యాయవాదులు నండూరి రామ్మోహన్‌రావు, ఎ.అజయ్‌కుమార్, ఎం.కుటుంబరావు, సువర్ణరాజు, యు.పుల్లేశ్వరరావు పాల్గొన్నారు.



నినదిస్తున్న న్యాయవాదులు

పట్టుదల, కఠోర శ్రమయే కీలకం

ఎపి నిట్ అసోసియేట్ డీన్ సందీప్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

క్రమశిక్షణ, చక్కని ప్రణాళిక, అంకితభావం, కఠోర శ్రమ సాధించాలనే పట్టుదలే విద్యార్థుల పాలిట బ్రహ్మాస్త్రాలని ఎపి నిట్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ అసోసియేట్ డీన్ డాక్టర్ వి.సందీప్ సూచించారు. నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు గూడెం మహతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు శుక్రవారం ఎపి నిట్ ప్రాంగణాన్ని సందర్శించారు. ప్రాంగణంలోని ఇండోర్ స్టేడియం, ప్రయోగశాలలు, గ్రంథాలయం, వర్క్‌షాపులను పరిశీలించి యంత్రాల పనితీరు, వాటి ప్రాధాన్యతను విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో సందీప్ మాట్లాడుతూ విద్యార్థులు వేసే ప్రతి అడుగూ విజయానికి మెట్టుగా నిలిచినప్పుడే ఉన్నతశిఖరాలను సులువుగా అధిరోహించడం సాధ్యమవుతుందన్నారు. పాఠశాల స్థాయి నుంచే లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలన్నారు. ఆధునిక పోటీ ప్రపంచంలో రాణించాలంటే సాంకేతికతను అందిపుచ్చుకోవడంతోపాటు అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి ఇటువంటి క్షేత్రస్థాయి పర్యటనలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివత్తి చేశారు. కార్యక్రమంలో మహతి స్కూల్ కరస్పాండెంట్ బండారు మనోహర్, అకడమిక్ డీన్ స్వాతి, ఉపాధ్యాయులు మారీష్, ప్రసాద్‌రాజు, మాధురి, సునీత, లక్ష్మీప్రసన్న, నజరీన్, యతీష్, గోపి తదితరులు పాల్గొన్నారు.



వివరిస్తున్న డీన్ సందీప్

జాతీయస్థాయి పోటీలకు ఆది

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి గొల్ల ఆది (థర్డ్ బికాం)గత నెల 23వ తేదీన ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్ ఎస్ఎస్ఎన్, వ్యాయామ విద్యావిభాగం ఆధ్వర్యంలో జరిగిన నేషనల్ లెవెల్ అడ్వెంచర్ క్యాంపు సంబంధించి సెలక్షన్లో పాల్గొన్నారు. ఈ నెల 18వ తేదీ నుంచి 28వ తేదీ వరకు హిమాచల్ ప్రదేశ్‌లో జరిగే జాతీయ క్యాంప్ సెలక్షన్లో పాల్గొంటారని ప్రిన్సిపల్ తెలిపారు. ఈ క్యాంపులో కొండగుట్టలు ఎక్కడం, రోప్ సహాయంతో పైకి ఎక్కడం వంటి సాహసోపేతమైన కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ విద్యార్థిని కళాశాల వైస్ ప్రిన్సిపల్ టి.కృష్ణ, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.రామకృష్ణ, ఇతర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

వికలాంగులకు దిక్సూచిగా భవిత కేంద్రాలు

ప్రజాశక్తి - గణపవరం

వికలాంగులకు భవిత కేంద్రాలు దిక్సూచిగా ఉన్నాయని నిడమర్రు ఎంఇఒ-2 రాంబాబు అన్నారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం నిడమర్రు భవిత కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో రాంబాబు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి భవిత కేంద్రం ఐఇఆర్పి ఉపాధ్యాయులు ఇల్లపు నవ్యశ్రీ అధ్యక్షత వహించారు. క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం కొప్పాక శ్రీహరి, ఆడబాల అప్పారావు, డి.అప్పారావు, భావాయిపాలెం స్కూలు ఉపాధ్యాయులు వి.సుబ్బారావు, వరలక్ష్మి పాల్గొన్నారు.

మొగల్తూరు : వికలాంగులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని స్కూల్ కాంప్లెక్స్ ఛైర్మన్ పదనం రవిశంకర్ సర్కార్ సూచించారు. ఈ నెల మూడో తేదీన నిర్వహించాల్సిన వికలాంగుల దినోత్సవాన్ని తుపాన్ కారణంగా శుక్రవారం కుక్కలవారితోటలోని భవిత కేంద్రంలో నిర్వహించారు. విద్యార్థులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చినవారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో భవిత స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎస్.వి.వి.లింగేశ్వరరావు, ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాస్, ఐఇఆర్టి ఎం.గంగాధరరావు, ఫిజియోథెరపీ వైద్యుడు జి.ఆయోన్ ఉన్నారు.

కొడమంచిలిలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఆచంట

కొడమంచిలి సచివాలయం-2లో జరగాల్సిన వైద్య శిబిరం సచివాలయం-1లో నిర్వహించడంపై ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం వల్లూరు పిహెచ్సి వైద్యాధికారితో మాట్లాడగా సరైన సమాధానం చెప్పకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. క్యాంపు పరిశీలనకు వెళ్లే కనీసం స్పందించకుండా రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇటువంటి డాక్టర్‌ని తక్షణమే బదిలీ చేసి రోగులకు అన్ని విధాలుగా అందుబాటులో ఉండే డాక్టర్‌ని నియమించాలని కోరారు. కొడమంచిలిలో జరుగుతున్న మెడికల్ క్యాంపును వదిలేసి వెళ్లిపోయిన వల్లూరు పిహెచ్సి వైద్యాధికారిపై ఉన్నతాధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పాడి పశువులకు టీకాలు

ప్రజాశక్తి - ఆచంట (పెనుమంట్ర)

తుపాన్ ప్రభావం వల్ల పశువులకు అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా గొంతు వాపు టీకాలు వేయించుకోవాలని పెనుమంట్ర మండల పశు వైద్యాధికారి జి.వరలక్ష్మి అన్నారు. మండలంలోని పొలమూరు, ఓడూరు, నెలమూరు, మామిడూరు, జుత్తిగ, సోమరాజు ఇల్లింద్రపర్రు, సత్యవరం గ్రామాల్లో పశువులకు గొంతు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ పశువుల్లో అధిక జ్వరం, గొంతు, మెడ, ముందు కాళ్ల మధ్య భాగంలో నీరు చేరడం వల్ల శ్వాస తీసోవడంలో ఇబ్బంది పడతాయన్నారు. రైతులందరూ వీటిని ముందుగా గుర్తించి టీకాలు వేయించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో 350 పశువులకు టీకాలను వేసినట్లు ఆమె తెలిపారు.

భీమవరంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం ఎనిమిదో క్లస్టర్‌లో 25వ బూత్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించిన టిడిపి రాష్ట్ర కార్యదర్శి, భీమవరం నియోజకవర్గ పరిశీలకులు దాసరి ఆంజనేయులు మాట్లాడుతూ వైసిపి పాలనలో రాష్ట్రం అన్నివిధాలా వెనుకబడిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి గూడూరు సుబ్బారావు, ఇన్‌ఛార్జి ఎద్దు ఏసుపాదం, నేదునూరి గంగాధర్ తిలక్, మాత సురేష్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఆచంట

తుపాన్ వల్ల నష్టపోయిన రైతులు అధైర్య పడొద్దని, రైతుల వద్ద ధాన్యాన్ని ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్ ద్వారా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య అన్నారు. వల్లూరు పంట పొలాల్లో ముంపు నీటిని వేగవంతంగా బయటకు తరలించే విధంగా ఉపాధి హామీ కూలీలతో ప్రక్షాళన చేపట్టారు. ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. నష్టపోయిన రైతుల వివరాలను తక్షణమే నమోదు చేయాలని, పంట బోదెలు, మురుగు కాలవల్లో చెత్తాచెదారాన్ని తొలగించి పంటపొలాల్లో నీరు త్వరితగతన బయటకు వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

పాలకొల్లు : పాలకొల్లు శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు భీమవరానికి చెందిన నడింపల్లి వెంకటరామరాజు - వెంకట సుబ్బులక్ష్మి దంపతులు రూ.1,01,116 విరాళం అందించారు. ఆలయ ఛైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, కార్యనిర్వాహణాధికారి యాళ్ల సూర్యనారాయణలకు శుక్రవారం ఆలయంలో చెక్కును అందించారు. వారికి స్వామి వారి ఫొటో, ప్రసాదాలు అందించారు.

నేరాలు - ఘోరాలు

ఒకేరోజు రెండు దొంగతనాలు

మరొకటి విఫల యత్నం

రూ.2.50 లక్షల నగదు, రెండు హార్డ్ డిస్కులు, సీసీ కెమెరాలు చోరీ

ప్రజాశక్తి - ఆకివీడు


మండల కేంద్రమైన ఆకివీడు పట్టణంలో ఒకేరోజు రెండు చోరీలు జరిగాయి. మండలంలోని పెదకాపవరంలో మరో చోరీ విఫలయత్నం జరిగింది. పట్టణంలో మాదివాడ అందేవారిబోది పక్కన ఉన్న సుజుకి పాండురంగ మోటార్స్ షోరూం, ఆ పక్కనే ఉన్న శివ సాయి ఎక్వాయి ఎంటర్‌ప్రైజెస్‌లో ఒకే తరహాలో రెండు చోరీలు జరిగాయి. ఆయా వ్యాపార సంస్థల సిబ్బంది ఇచ్చిన సమాచారం ప్రకారం రెండు సంస్థల్లోనూ ఆయా సంస్థలకు సంబంధించిన కంప్యూటర్‌లోని హార్డ్ డిస్క్, సీసీ కెమెరాలు సైతం చోరీకి గురయ్యాయి. కాగా శివసాయి ఆక్వా ఎంటర్‌ప్రైజెస్‌ల సుమారు రూ.20 వేల నగదు చోరీకి గుర్రై ఉంటుందని అంచనా వేశారు.

సుజుకి కంపెనీ షాపులో రూ.2.50 లక్షలకు పైబడి నగదు యజమాని షాపులో ఉంచినట్లుగా చెప్పారు. మండలంలోని పెదకాపవరం గ్రామాల్లో చేపల మేతకు చెందిన షాపులో చోరీ విఫలయత్నం జరిగింది. షాపు తాళాలు పగలకొడుతుండగా శబ్దాలు అవ్వడంతో ఎవరైన వస్తారని పరారైనట్లు తెలిసింది. పెదకాపవరం ఆకివీడు రెండు చోట్ల షాపుల్లోనే ఎక్కువనే చోరీ జరిగాయి. సంఘటన ప్రాంతాన్ని డిఎస్‌పి శ్రీనాథ్ పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగబాబు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని యండగండి శివారు పంట పొలాల్లో పేకాట ఆడుతున్నవారిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని యండగండి శివారు పంట పొలాల్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఉండి పోలీస్‌స్టేషన్ ఎఎస్ఐ ఆకురాతి సూర్యనారాయణ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న 13 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.97,250 నగదు, పది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎఎస్ఐ ఆకురాతి సూర్యనారాయణ తెలిపారు. మండలంలోని యండగండి, ఉనుదుర్రు, పాందువ్వ గ్రామాల్లో పేకాట, కోడిపందేలను నిర్వాహకులు విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారని, వాటిని అరికట్టడంలో పోలీస్ శాఖ విఫలమైందని మండలంలోని పలువురు గుసగుసలాడుతున్నారు.




రామరాజును సత్కరిస్తున్న మాజీ సర్పంచి శ్రీనివాసరావు

ఎంఎల్ఎ రామరాజుకు సత్కారం

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని సీసలి గ్రామంలో ఉన్న శ్రీలక్ష్మీదుర్గ అమ్మవారి ఆలయం వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం అఖండ అన్నసమారాధన, దుర్గామల్లేశ్వరస్వామి కళ్యాణం నిర్వహించారు. దీనిలో భాగంగా మాజీ సర్పంచి కట్రెడ్డి శ్రీనివాసరావు, విజయలక్ష్మి దంపతులు అమ్మవారికి సారెను గ్రామోత్సవం నిర్వహించి సమర్పించారు. గ్రామానికి చెందిన కాగిత గంగయ్య, వరలక్ష్మి దంపతులచే శాస్త్రోక్తంగా స్వామి, అమ్మవార్లకు కళ్యాణం నిర్వహించారు. ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం ఆయన్ని గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. మాజీ సర్పంచి కట్రెడ్డి శ్రీనివాసరావు రామరాజును సత్కరించి జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో తోట రామకృష్ణ, తోట హరిబాబు, నూకల వెంకటస్వామి, వాస్కూరి శ్రీనివాస్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



ఎన్నికైన నూతన కమిటీ

18న చలో ఢిల్లీ

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 18వ తేదీన చలో ఢిల్లీని జయప్రదం చేయాలని పివి.రావు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుమ్మాపు సూర్యవరప్రసాద్, పొన్నమండ బాలకృష్ణ పిలుపునిచ్చారు. ఎస్‌సి వర్గీకరణ జోలికి వస్తే బిజెపిని భూస్థాపితం చేస్తామన్నారు. భీమవరంలో పివి.రావు మాల మహానాడు రాష్ట్ర అత్యవసర సమావేశాన్ని బాలకృష్ణ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి మత కల్లోలాలను సృష్టిస్తుందన్నారు. ప్రధాని మోడీ ఒక కులానికి భుజం కాస్తూ వ్యవహరించడం అత్యంత దుర్మార్గమన్నారు. ఈ నెల 18న చేపట్టబోయే చలో ఢిల్లీకి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గోడి పెద్దిరాజు, కార్యదర్శి కొత్రపాటి వీరస్వామి, మీడియా కో-ఆర్డినేటర్ దేవా రాజేష్, నాయకులు నేలపాటి రాజబాబు, కుమార్ స్వామి, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన జిల్లా కమిటీ ఎన్నిక

స్థానిక కార్యాలయంలో పివి.రావు మాల మహానాడు నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా బండి శ్యాంబాబు, రాష్ట్ర కార్యదర్శిగా పిల్లి మునలయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బుంగ ఆదాముతో పాటు మరి కొంతమంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సూర్యవరప్రసాద్, బాలకృష్ణ నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందించారు.

వెంపటాపునకు అంతర్జాతీయ కళా గౌరవ్ సమ్మాన్ అవార్డు

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బరెల్లికి చెందిన కళారత్నం ఫౌండేషన్ ఆఫ్ ఆర్ట్ సొసైటీ అంతర్జాతీయ స్థాయిలో ఆన్‌లైన్ ఆర్ట్ కాంపిటీషన్స్ నిర్వహించింది. ఈ పోటీల్లో చిత్రకారుడు డాక్టర్ వెంపటాపు చిత్రించిన "అఫెక్షన్" చిత్రానికి ప్రథమ బహుమతిగా కళా గౌరవ్ సమ్మాన్ అవార్డ్ దక్కింది. ఆజాది కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా సంస్థ ఈ పోటీలు నిర్వహించిందని వెంపటాపు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసాపత్రం, ట్రోఫీ అందుకున్న వెంపటాపును జెడ్‌పి బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.పద్మావతి, సిబ్బంది కార్యదర్శి జిజె.ప్రభువరం, జయకుమార్, పాలా కృష్ణ, షరీఫ్, వీరభద్రం, సంజయ్ గాంధీ, వీరబాబు, పాపారావు, రాధ, శీలా, సురేంద్ర అభినందించారు.

ఏడు రిజిస్టర్లు ఇవ్వండి

ప్రజాశక్తి - ఆకివీడు

బ్లాక్ లెవెల్ అధికారులు ఎన్నికల ఓటర్ల జాబితా తయారీకి సంబంధించిన ఏడు రిజిస్టర్లను వెంటనే తయారు చేసి తమకు స్వాధీనం చేయాలని ఉండి నియోజకవర్గ ఎన్నికల అధికారి, డిపిఒ మల్లికార్జునరావు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన డిపిఒల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత రెండు రోజులుగా బిఎల్ఒలు ప్రత్యేక డ్రైవ్ ద్వారా సేకరించిన 6, 7, 8 ఫారాలను పూర్తిగా సరి చేస్తున్నామన్నారు.

594 తాగునీటి పరీక్షలు

తుపాన్ వల్ల పలు గ్రామాల్లో నిలిచిన వర్షపు నీరు లాగిన అనంతరం మురుగు పెరిగిపోయిందని డిపిఒ మల్లికార్జునరావు అన్నారు. ఆ మురుగును తొలగించేందుకు ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ కార్యక్రమం చేపట్టామన్నారు. పారిశుధ్య సమస్యల వల్ల దోమలు పెరిగి అనారోగ్య సమస్య ఏర్పడకుండా దోమల మందు ఫాగింగ్ (పిచికారీ) చేశామన్నారు. ఎక్కడికి ఎక్కడ తాగునీటి పరీక్షలు చేసి అందించే కార్యక్రమం చేపట్టాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. జిల్లాలో 594 గ్రామాల్లో ఈ మేరకు చర్యలు చేపట్టామన్నారు.

వర్షపు నీరు.. విద్యార్థుల అవస్థలు

ప్రజాశక్తి - ఉండి


మిచౌంగ్ తుపాను వల్ల ఉండి జెడ్‌పి హైస్కూల్ ఆవరణం చెరువులా మారడంతో ఇక్కట్లు తప్పట్లేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ వర్షపు నీటిలో స్థానికులు వలలతోటి చేపలు పట్టుకుంటున్నారు. స్కూల్ చుట్టూ చేపల చెరువులు, రొయ్యల చెరువులు ఉండటంతో వాటిలోని చేపలు క్రీడా ప్రాంగణంలోకి చేరడంతో వలలు వేసి చేపలు పట్టుకున్నారు. వర్షాలు తగ్గి మూడు రోజులవుతున్నా పాఠశాల ఆవరణలో నిల్వ ఉన్న నీటిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడన్నారు. నిల్వ నీరు వల్ల పిల్లలకు ఎటువంటి వ్యాధులు వస్తాయోనని తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. సిఎం జగన్ ఆడుదాం ఆంధ్రా అని ఆర్భాటం చేస్తున్నారు తప్ప సరైన గ్రౌండ్ లేదన్నారు. స్కూల్లో కూడా ఒక పిఇటి మాత్రమే



పాఠశాల ప్రాంగణంలో వర్షపు నీరు

ఉన్నారన్నారు. సెప్టెంబర్ 19వ తేదీన జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఉండి హైస్కూల్‌కి వచ్చి స్పెషల్ గ్రాంట్‌తో గ్రౌండ్ మొత్తం పూడుస్తానని చెప్పి వెళ్లారు తప్ప ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదన్నారు. పాఠశాల ఆవరణలో నీటిని ఇంజిన్ల సహాయంతో బయటకు తోడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి దాట్ల శ్రీదేవి ట్రస్ట్ సాయం



మృతదేహానికి నివాళులర్పిస్తున్న ట్రస్ట్ సభ్యులు

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని కాళ్లకూరులో పేద, బడుగు, బలహీన తరగతుల వారికి చేతనైన సహాయం అందిస్తున్నారని దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ సభ్యులు ఈదా భోగేష్ అన్నారు. మండలంలోని కాళ్లకూరు గ్రామానికి చెందిన సోడదాసి గాబ్రియేలు శుక్రవారం ఉపాధి పనికి వెళ్లి గుండెపోటుతో మృతి చెందారు. గ్రామస్తులు ద్వారా విషయం తెలుసుకుని మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. గాబ్రియేలు మృతదేహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కాళ్లకూరు గ్రామానికి చెందిన దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత దాట్ల వెంకటరామరాజు మానవతా దృక్పథాన్ని చాటుకున్నారని ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ బహుజన సంఘాల సమాఖ్య వ్యవస్థాపకులు సొడదాసి గంగయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిలీ కాసులు, పారుపూడి యోహాను, ఈదా రవికుమార్, సొడదాసి అశోక్ పాల్గొన్నారు.

రూ.16 కోట్ల నిధులతో వాండ్రం అభివృద్ధి

ఉండి :మండలంలోని వాండ్రంలో గ్రామ సర్పంచి దాసరి వెంకటకృష్ణ, వైసిపి మండల అధ్యక్షులు పెన్మత్స ఆంజనేయరాజు ఆధ్వర్యంలో వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వాండ్రం గ్రామ ప్రజలకు అందించిన వివిధ పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచి దాసరి వెంకటకృష్ణ, ఆంజనేయరాజు మాట్లాడుతూ సిఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షులు బుద్ధరాజు రంగరాజు, కోణాల మహంకాళి, మాజీ సర్పంచి యాడంగి ఏసు, పంచాయతీ కార్యదర్శి జెవిటినాయుడు, సచివాలయ కన్వీనర్లు మాదాసి విజయ పాల్గొన్నారు.

తడిచిన ధాన్యం పరిశీలన

ప్రజాశక్తి - గణపవరం

వర్షం వల్ల తడిచిన ధాన్యాన్ని తేమ శాతంతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలని మిల్లర్లకు తెలిపామని ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) అన్నారు. మండలంలోని అర్ధవరంలో కళ్లాలో తడిచిన ధాన్యాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ అధిక వర్షాల వల్ల తడిచిన ధాన్యాన్ని తేమశాతంతో సంబంధం లేకుండా స్థానిక రైసుమిల్లర్లను కోరినట్లుచెప్పారు. రైతులకు పంట నష్టం కలగకుండా చివరి గింజవరకు కొనుగోలు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గణపవరం ఎంపిపి దండు వెంకటరామరాజు, వ్యవసాయశాఖాధికారి వైవి.ప్రసాద్, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ వెజ్జు వెంకటేశ్వారావు పాల్గొన్నారు.

14, 15 తేదీల్లో 36 గంటల ధర్నా

ప్రజాశక్తి - పోడూరు

ఆశాల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కౌన్సిల్ సభ్యులు పిల్లి ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ నెల 14, 15వ తేదీల్లో కలెక్టరేట్ వద్ద 36 గంటల ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ వర్కర్లుగా ఆశాలను మార్చాలన్నారు. పని భారం తగ్గించాలని కోరారు. ఆశా వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి అమ్మాజీ, సిఐటియు మండల అధ్యక్షులు బి.వెంకట్రావు మాట్లాడగా నేతలు గొర్ల సుజాత, బొంతు శ్రీను, మూడే మోజేష్, పల్లె శ్రీదేవి, భవాని, సైదాబీబీ పాల్గొన్నారు.

పీజీ, పిహెచ్‌డి కోర్సుల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో 2023-24 విద్యా సంవత్సరానికి హార్టికల్చర్ కోర్సులోని వివిధ విభాగాల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్, పిహెచ్‌డి కోర్సుల్లో ప్రవేశాలకు వెంకటరామన్నగూడెం ఉద్యాన కళాశాలలో శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో 50 సీట్లు, పిహెచ్‌డి కోర్సులో 21 సీట్లు భర్తీ చేసినట్లు ఉద్యాన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాస్ తెలిపారు. ఈ కోర్సుల్లో చేరిన పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు నెలకు రూ.ఐదు వేలు చొప్పున, పిహెచ్‌డి విద్యార్థులకు రూ.ఏడు వేల చొప్పున స్టైఫండ్ ప్రభుత్వం నుంచి అందుతుందన్నారు.

వల్లూరులో రైతు భరోసా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ఆచంట

మండలంలోని వల్లూరు రైతు భరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధిక వర్షాల నేపథ్యంలో రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని, పూర్తిస్థాయిలో ఆదుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. రైతులు ధాన్యం అమ్మకాల్లో ఎలాంటి కష్టాలు పడకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని, ఈ మేరకు సిఎం జగన్ ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. రైతుల వద్ద పత్తి ధాన్యపు గింజను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తామన్నారు. సాధారణ రకానికి రూ.2183, ఎ గ్రేడ్ రకానికి రూ.2203 ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. దళారుల మాటలు నమ్మి రైతులు మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో వల్లూరు సొసైటీ ఛైర్‌పర్సన్ నార్గన వీర వెంకట సత్యనారాయణ, పర్సన్స్, పెచ్చెట్టి సత్యనారాయణ, గంగోలు శ్రీనివాసరావు, కార్యదర్శి యేడిద వెంకట కృష్ణారావు, ఇజ్రాయిల్, కుసుమ సత్యనారాయణ, కీర్తన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో దోమలను అరికట్టాలి

ప్రజాశక్తి - గణపవరం

దోమలు ద్వారా వ్యాపించే వ్యాధులను ప్రజల భాగస్వామ్యంతో అరికట్టవచ్చని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు అన్నారు. మండలంలోని కాశిపాడులో శుక్రవారం నిర్వహించిన డ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఫీవర్ సర్వేపై స్థానికులకు అవగాహన కల్పించారు. గ్రామంలో ఎవరికైనా అనుమానిత జ్వరం లక్షణాలు ఉంటే స్థానిక పిహెచ్‌సికి వెళ్లి ప్రాథమిక నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాలు గ్రామాల్లో ప్రతి ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవటం ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు నామాల రాజు, ఎఎన్ఎం వి.శివకుమారి, ఆశాలు వరలక్ష్మి, కృష్ణకుమారి పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధి వెదుళ్లపాలెంలో పంచాయతీ కార్యదర్శి సహకారంతో శానిటేషన్ చేయించి, ఎబేట్ మందును నీటి నిల్వలు ఉన్న ప్రాంతాల్లో పిచికారీ చేయించామని సబ్ యూనిట్ అధికారి కె.రాజ్‌కుమార్ తెలిపారు. ఇంటి పరిసరాల్లో, పూల కుండీల్లో, డ్రమ్ముల్లో నీరు నిల్వ లేకుండా చేసుకోవడం వల్ల దోమల పెరుగుదలను అరికట్టవచ్చన్నారు. జ్వర లక్షణాలు ఏమైనా ఉంటే వెంటనే ఆశ, ఎఎన్ఎంలను సంప్రదించి వైద్య సహాయం పొందాలని తెలిపారు. ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు దోమల ద్వారా వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, కార్యదర్శులు శ్రీనివాస్, రాము, హెల్త్ అసిస్టెంట్లు, దివాకర్ బాబు, గోపాలకృష్ణ, సత్తిరాజు, ఎంఎల్‌హెచ్‌పి మార్తమ్మ, ఎఎన్ఎం రోజాకమల పాల్గొన్నారు.

తేమశాతంతో సంబంధం లేకుండా ధాన్యం కొనాలి

పెనుగొండ :మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో ఆమోదించిన తేమ శాతం ధాన్యాన్ని రైస్ మిల్లర్లు కొనుగోలు చేయాలని కౌలు రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని దేవ, తామరాడ, మునమర్రు రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులు శుక్రవారం ధర్నా నిర్వహించి వినతిపత్రాలు అందించారు. రైతు భరోసా కేంద్రం ఆమోదించిన తేమ శాతానికి కట్టుబడి రైస్ మిల్లర్లు ధాన్యం దిగుమతులు చేసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. రైతులను మిల్లు యజమానులు ఇబ్బంది పెట్టకుండా అధికారులు పర్యవేక్షించాలని కోరారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు చిలుకూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ మిచౌంగ్ తుపాను రైతులను నిండా ముంచిందన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులను పంపించి నష్టాన్ని అంచనా వేయాలని, ఎకరానికి రూ.20 వేలు నష్ట పరిహారంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కౌరు జగన్నాథం, మన్నే వెంకటేశ్వరరావు, మద్దూరి చిన్న సూర్యనారాయణ పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా గోతుల పూడ్చివేత

ప్రజాశక్తి - వీరవాసరం

రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని, కాస్తంత గోతులు పూడ్చండని అధికారులకు మొరపెట్టుకున్నా స్పందించిన దాఖలాలు లేవు. దీంతో విసుగు చెందిన మడుగుపోలవరంలంక గ్రామస్తులు శుక్రవారం తామే స్వచ్ఛందంగా గోతులు పూడ్చుకుని వారు ఎదుర్కొంటున్న సమస్యను వారే తీర్చుకున్నారు. అందుబాటులో భవనాలకు చెందిన రద్దు ఉండటంలో ఆలస్యం చేయకుండా వారు దానిని వినియోగించుకున్నారు. ఆలోచన వచ్చిందే తడవుగా గుడాల పెద్దిరాజు, దొంగ శ్రీరాములు, ఏసుబాబు, నాగరాజు, సత్తిబాబు, బొక్కా వీరమ్మ జట్టుగా ఏర్పడి శ్రమదానంతో గోతులు పూడ్చుకున్నారు. కొన్నేళ్లుగా మడుగు పోలవరం లంక నుంచి నవుడూరు సెంటర్ వరకు ఉన్న గోతులు పూడ్చాలంటూ సిపిఎం ఆధ్వర్యంలో పలు మార్లు ఆందోళనలను, నిరసనలు పాదయాత్రలు చేసి అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా వారి నుంచి కనీస స్పందన కరువైంది. దీంతో చేసేది లేక ప్రజలు ఆ గోతుల గుండానే రాకపోకలు సాగిస్తున్నారు. గ్రామ ప్రధాన కూడలి వద్ద ఉన్న పెద్ద గోతులను కొంతమంది గ్రామస్తులే పూడ్చడంతో వారిని అభినందిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మొగల్తూరు :కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సర్పంచి పడవల మేరీసత్యనారాయణ అన్నారు. మొగల్తూరు పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రధాని మోడీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలందరికీ తెలిసేలా ప్రచారం చేయాలన్నారు. ఈ సమావేశంలో సంకల్ప యాత్ర జిల్లా కన్వీనర్ పులపర్తి వెంకటేశ్వరరావు, నాయకులు కవురు శ్రీనివాస్, పడవల సత్యనారాయణ, తిరుమాని స్వామి, దొంగ రామారావు, పులపర్తి రమేష్, పంచాయతీ కార్యదర్శి జయరాజు ఉన్నారు.

యువతకు కిట్లు అందజేత

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఒకటి, రెండు వార్డులకు చెందిన యువతకు క్రికెట్ బ్యాడ్మింటన్ వాలీబాల్ కిట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని సచివాలయాల పరిధిలో రెండు క్రికెట్ కిట్లు, నాలుగు బ్యాడింటన్లు వాలీబాల్ కిట్లు అందిస్తామన్నారు. ఇందులో భాగంగా 15 ఏళ్ళు పైబడిన యువత క్రీడల్లో పాల్గొని రాష్ట్రస్థాయిలో మంచి పేరు తీసుకురావాలన్నారు. ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు డిసెంబర్ 15వ తేదీన ప్రారంభమై ఫిబ్రవరి 3న విశాఖపట్నంలో నిర్వహించే ముగింపు కార్యక్రమంతో ముగుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె వెంకటరమణ, ఒకటో వార్డు కౌన్సిలర్ సోమరాజు దుర్గాభవాని, భూసారపు జయప్రకాష్, గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, బర్రి శంకర్, గోరు సత్తిబాబు, కావలి నాని, గుబ్బల నారాయణమూర్తి పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామికి అభయహస్తం బహూకరణ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి వారికి రూ.నాలుగు లక్షల విలువైన రత్నాలు పొదిగిన వెండి అభయహస్తంను రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ చేతుల మీదుగా భక్తులు శుక్రవారం ఆలయ నిర్వాహకులకు బహూకరించారు. భక్తులు, లక్ష్మీపతిరాజు కుటుంబీకులు దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిపిన అనంతరం వెండి అభయహస్తంను స్వామి వారికి అలంకరించారు.

'ఆడుదాం ఆంధ్రా'కు విద్యార్థులను సమీకరించాలి

ఆచంట (పెనుమంట్ర) :ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి విద్యార్థులను సమీకరించాలని ఎంపిడిఒ పి.పద్మజ వాలంటీర్లకు సూచించారు. ఎంపిడిఒ కార్యాలయంలో వాలంటీర్లకు ఆడుదాం ఆంధ్రాపై మార్టేరు ఎస్‌విజిహెచ్ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు కర్రి కృష్ణారెడ్డిచే ఒక రోజు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆయా క్రీడలు ఏ విధంగా ఆడాలి, జాగ్రత్తలు ఏ విధంగా తీసుకోవాలనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఎఒ వి.పూర్ణబాబ్జి, వాలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విజయవాడలో ధర్నా

భీమవరం : ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యలపై ఈ నెల తొమ్మిదో తేదీన విజయవాడలో నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నూతన విద్యా విధానంతో విద్యావ్యవస్థ నాశనమవుతున్న పరిస్థితి ఉందన్నారు. అసబద్ధత ఉత్తర్వులు 177, 128, 84, 85 జిఒలు ప్రభుత్వ విద్యారంగాన్ని విచ్ఛిన్నం చేస్తున్నాయన్నారు. దీంతో విద్యారంగం ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. ఈ ఉత్తర్వులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. టోఫెల్ బోధనను రద్దు చేసి, ఐబి సిలబస్ అమలును విరమించుకోవాలన్నారు. ఎంటిఎస్ విధానాన్ని రద్దు చేసి 1998, 2008 డిఎస్‌సి వారికి సర్వీస్ ప్రయోజనాలు కల్పించాలన్నారు. పలు సమస్యలపై నిర్వహించనున్న ధర్నాలో అంతా భాగస్వాములు కావాలని కోరారు.